క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో రామచంద్రపురం విద్యార్థి ప్రతిభ



మణిశేఖర్‌ను అభినందిస్తున్న జీవీరావు తదితరులు

రామచంద్రపురం: లిటిల్ ఛాంప్స్ చెస్ అకాడమీ, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ర్యాంకింగ్ స్కూల్స్ ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన విద్యార్థి దంగేటి గిరి మణిశేఖర్ మొదటి బహుమతి సాధించాడు. ఇతడు స్థానిక మోడరన్ హైస్కూల్ పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత జీవీ రావుతో పాటు ఉపాధ్యాయులు అతడిని అభినందించారు.

రాష్ట్ర అథ్లెటిక్ కోచ్‌గా ప్రసాద్‌రెడ్డి



ప్రసాద్‌రెడ్డి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పీవీ ప్రసాద్‌రెడ్డి రాష్ట్ర అథ్లెటిక్ కోచ్‌గా నియమితులైనట్టు స్కూల్ హెచ్‌ఎం జి.రాజేశ్వరి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఏపీ ఎడ్యుకేషనల్ కమిషనర్ నుంచి ఉత్తర్వులందాయని చెప్పారు. ఈ నెల 26 నుంచి నవంబర్ 5 వరకూ గోవాలో జరిగే జాతీయ క్రీడలకు ప్రసాద్‌రెడ్డి సేవలందిస్తారని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్యసుబ్రహ్మణ్యం, రామచంద్రపురం జోన్ పీఈటీ సంఘ ప్రతినిధులు ఎస్.సత్యనారాయణ, ఏవీవీ సత్యనారాయణ, కె.శ్రీనివాస్, పీఈటీలు ఆని శ్రీనివాస్, జి.అనురాధ, ఉమ, కృష్ణమోహన్ తదితరులు ప్రసాదరెడ్డికి అభినందనలు తెలిపారు.

బాలునిపై లైంగిక వేధింపులు

మండపేట: నాలుగేళ్ల బాలునిపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత బాలుడి తల్లి పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలివి. స్థానిక సైధిల్‌పేటలోని బాలుని తల్లిదండ్రులు అద్దెకుంటున్నారు. వీరికి నాలుగేళ్ల, ఐదు నెలల వయస్సు కలిగిన ఇద్దరు పిల్లలున్నారు. మున్సిపల్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాయుడు శ్రీనివాస్ ఇటీవల అదే ఇంటిలో అద్దెకు వచ్చాడు. బాలునితో చనువుగా ఉంటూ ప్లాటులోకి తీసుకువెళ్లాడు. కొద్దిసేపటికి బాలున్ని తీసుకువచ్చేందుకు తండ్రి వెళ్లి తలుపులు తెరిచి చూశాడు. తన బిడ్డపై శ్రీనివాస్ లైంగిక దాడికి పాల్పడుతూ కనిపించాడు. వెంటనే వెళ్లి మున్సిపల్ ఉద్యోగికి దేహశుద్ధి చేశాడు. బాలుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు

రామచంద్రపురం రూరల్: ఏపీయస్ ఆర్టీసీ పార్శిల్, కొరియర్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా ఈ నెల 26 నుంచి నవంబరు 25 వరకూ పార్శిల్, కొరియర్ డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు రామచంద్రపురం డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 50 కేజీల బరువున్న పార్శిళ్లు, కొరియర్‌లను పది కి.మీ. పరిధిలో వారి ఇంటి వద్దకే అందించనున్నట్టు చెప్పారు.

ఆర్డీవో సింధుకు సత్కారం

రామచంద్రపురం: మార్కాపురం డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న రామచంద్రపురం ఆర్డీవో పి.సింధు సుబ్రహ్మణ్యంను దళిత ఐక్య వేదిక నాయకులు బుధవారం సత్కరించారు. సంఘ నాయకులు గాలింకి చిట్టిబాబు, కొమ్ము సురేష్, కొమ్ము నాగేశ్వరరావు, ములపర్తి ప్రభాకర్ తదితరులు ఆమెను సత్కరించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

కపిలేశ్వరపురం: నల్లూరులోని కొత్త కాలనీ కాలువ వద్ద రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి బుధవారం భూమి పూజ జరిగింది. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ద్వారబంధ కవచం బహూకరణ



ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ద్వారబంధ కవచం

రాయవరం: వెంటూరులో వేంచేసియున్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి దాతలు ద్వారబంధ కవచాన్ని బహూకరించారు. గ్రామానికి చెందిన దాతలు దేవళ్ల వెంకటరావు, ఎంఎస్‌కే భాస్కరరావులు కలిపి రూ.45 వేల విలువైన 22 కేజీల ఇత్తడితో ద్వారబంధ కవచాన్ని ఏర్పాటు చేశారు. తొలుతగా ద్వారబంధ కవచానికి సంప్రోక్షణ పూజలు నిర్వహించారు.

మాలధారణం

- మండల దీక్షకు అయ్యప్ప భక్తులు
- శరణుఘోషతో మారుమోగుతున్న ఆలయాలు

మండపేట: మండల దీక్షలు మొదలుకావడంతో ఏ గ్రామంలో చూసినా.. స్వాముల సందడి కనిపిస్తోంది. నీలిమలవాసుని శరణుఘోష మిన్నంటుతోంది. నల్లని దుస్తులు, మెడలో మణిహారం, నుదుటన చందనం, నోట శరణుఘోష, శీతల స్నానం, భూతలశయనంతో అయ్యప్ప భక్తులు శ్రీధర్మశాస్తకు పూజలు చేస్తున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం అయ్యప్ప స్వామి భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. మండల దీక్ష చేసే స్వాములు విజయదశమి నుంచి మాలధారణ చేస్తుంటారు. నవంబరు 16న శబరిమలలో స్వామివారి సన్నిధానం తెరవనున్నారు. డిసెంబరు 27 వరకూ సన్నిధానంలో మండల పూజా మహోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో మండల పూజల్లో పాల్గొనే భక్తుల మాలధారణలు ఇప్పటికే మొదలయ్యాయి. విజయదశమి, ఏకాదశిలను పురస్కరించుకుని మంగళ, బుధవారాల్లో నియోజకవర్గంలో మూడు వేల మందికి పైగా భక్తులు మాలధారణ చేశారు. మకరజ్యోతి దర్శనం కోసం వెళ్లే భక్తులు నవంబరులో మాలధారణ చేస్తారని గురుస్వాములు తెలిపారు.

ఆలయాల్లో శరణుఘోష

నియోజకవర్గంలోని ద్వారపూడి, మండపేటల్లో ఉన్న అయ్యప్పస్వామివారి ఆలయాలు శరణుఘోషతో మారు మోగుతున్నాయి. 1983లో గురుస్వామి ఎస్ఎల్ కనకరాజు ఆధ్వర్యంలో ద్వారపూడిలో నిర్మించిన అయ్యప్ప ఆలయం ఆంధ్రా శబరిమలగా పేరొందింది. శబరిమల వెళ్లలేని స్వాములు ద్వారపూడిలో ఇరుముడి సమర్పిస్తుంటారు. మండపేటలో మాజీ ఎమ్మెల్యే దివంగత వీవీఎస్ఎస్ చౌదరి సారథ్యంలో 1983లో ఆలయాన్ని నిర్మించారు. మండపేటతో పాటు కపిలేశ్వరపురం, కడియం, ఆలమూరు మండలాల నుంచి వందలాది మంది భక్తులు మండపేటలోని అయ్యప్ప ఆలయంలో మాలధారణ చేస్తుంటారు. వీవీఎస్ఎస్ చౌదరి మనువడు వి.సాయికుమార్ ఆలయ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. మండల దీక్షల కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.



మండపేటలో మాలధారణ కోసం బారులు తీరిన భక్తులు

స్వాములకు అన్నదానం

అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు ఎప్పటిలాగే ఈ ఏడాది మండపేటలో దాతలు ఉచిత భిక్ష ఏర్పాట్లు చేశారు. అయ్యప్ప ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ వి.సాయికుమార్ ఆధ్వర్యంలోను, శ్రీ వేగుళ్ల సూర్యారావు చారిటబుల్ ట్రస్టు చైర్మన్, పారిశ్రామికవేత్త వీవీఎస్ఎస్ చౌదరి (మాధవి బాబు) ఆధ్వర్యంలో ఆలయ సమీపంలోని అయ్యప్ప దీక్షా మందిరం వద్ద అన్నదానాలను ప్రారంభించారు.



మండపేటలో వేంచేసి ఉన్న అయ్యప్పస్వామి వారు

భక్తుల సంఖ్య పెరుగుతోంది



కుల, మత, జాతి వివక్షతకు తావు లేకుండా అందరూ ఒక్కటేనని చాటేదే అయ్యప్ప దీక్ష. 41 రోజుల నియమనిష్ఠలతో దీక్షలు చేసిన వారు అయ్యప్ప కృపకు పాత్రులవుతారు. ఏటా మాలధారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం శుభసూచకం.

– సుబ్రహ్మణ్య నంబూద్రి, ఆలయ అర్చకుడు, మండపేట

తొలిసారి దీక్షాధారణ



కొంతమంది స్వాములతో కలిసి తొలిసారిగా అయ్యప్ప దీక్ష తీసుకున్నాను. పీఠాన్ని ఏర్పాటు చేసుకుని స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నాం. దీక్ష చేయాలన్న కల ఇప్పటికి నెరవేరింది. మాలధారణతో మానసిక ప్రశాంతత కలుగుతోంది.

– గారపాటి అశోక్‌కుమార్, మెర్నిపాడు

వైభవంగా అయ్యప్ప పడిపూజ



సోమేశ్వరంలో జరిగిన అయ్యప్పల పేటతుళ్లి

రాయవరం: సోమేశ్వరంలో అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. కర్రి ఆదినారాయణరెడ్డి 36వ మాలధారణను పురస్కరించుకుని పడిపూజను ఏర్పాటు చేశారు. మహాగణపతి హోమం, దేవి కుంకుమార్చన నిర్వహించారు. అయ్యప్ప స్వామివారి పేటతుళ్లి భక్తులను ఆకట్టుకుంది. కేరళ మంగళ వాయిద్యాలు, డోలు, సన్నాయి మేళాలతో అయ్యప్పల వేషధారణలతో పేటతుళ్లి నిర్వహించారు. రాత్రి బ్రహ్మశ్రీ పూజ్యం నాగేశ్వరశర్మ అర్చకత్వంలో శైవాగమ విద్వాన్, దైవజ్ఞరత్న గురుస్వామి ఆధ్వర్యంలో పూజ్యం మల్లిఖార్జున అనీల్‌శర్మ ఆచార్యునిగా వ్యవహరించగా, ఆదిరెడ్డిగురుస్వామి, నాగలక్ష్మి మాత, హరిహరనారాయణరెడ్డి, కాంతిరేఖ, సతీష్‌రెడ్డి స్వామి,సృజనకుమారి దంపతులు పీఠలపై కూర్చుని మహాగణపతి, అయ్యప్ప స్వామివారి పడిపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమలాపురం శేఖర్ గురుస్వామి ఆధ్వర్యంలో భజన గీతాలాపన నిర్వహించారు. ద్వారపూడికి చెందిన ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి, కాకినాడకు చెందిన వేలు గురుస్వామి, రాజమహేంద్రవరం నుంచి సత్యశ్రీనివాసరావు గురుస్వామిలు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.

ప్రణాళికాబద్ధంగా ద్వారపూడి అభివృద్ధి

- అడ్డుకునేందుకు ఎమ్మెల్యే యత్నం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపాటు

మండపేట: నియోజకవర్గంలో అతిపెద్ద గ్రామమైన ద్వారపూడిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతుంటే, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అడ్డుకోవాలని చూశారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర నేతలు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు తదితరులతో కలిసి బుధవారం ఎమ్మెల్సీ తోట ద్వారపూడిలో రూ.19.8 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో పంచాయతీకి ఆదాయం వస్తోందన్నారు. ప్రయాణికుల కోసం విశాలమైన బస్‌షెల్టర్ నిర్మిస్తుంటే, అనుమతులు లేవంటూ ఎమ్మెల్యే వేగుళ్ల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి, అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. కేశవరం, ద్వారపూడి, జెడ్ మేడపాడు గ్రామాల్లో రైతుల కోసం పంతరోడ్లు అభివృద్ధి చేస్తుంటే, ఓర్వలేకపోయారన్నారు. మండపేట పర్యటనకు వచ్చిన మాజీ సీఎం చంద్రబాబుతో తాను గ్రావెల్ అమ్ముకుంటున్నట్టు అసత్య ఆరోపణలు చేయించారని ఎమ్మెల్సీ తోట ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో గ్రావెల్ ఎత్తుకెళ్లి ఎవరు లే అవుట్లు వేసుకున్నారో తేలుద్దామంటూ కేశవరం, ద్వారపూడి గ్రామాల రైతులు సవాల్ చేసినప్పుడు ఎమ్మెల్యే వేగుళ్ల తోక ముడిచారన్నారు. సర్పంచ్ కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట ఎనలేని తోడ్పాటును అందిస్తున్నారని చెప్పారు. బస్ షెల్టర్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో ప్రతిపక్ష పార్టీ అసత్య ఆరోపణలతో పనులు అడ్డుకోవాలని చూస్తే, ఎమ్మెల్సీ తోట అండదండలతో వాటిని పూర్తిచేశామని సర్పంచ్ కిన్నెర, ఉప సర్పంచ్ శేషారావు తెలిపారు.



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

అభివృద్ధి పనులు ప్రారంభం

తొలుత రూ.2.2 కోట్లతో నిర్మించిన పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్, రూ.10 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్, రూ.15.6 కోట్లతో నిర్మించిన ద్వారపూడి–పీ ఆర్బీ పురం రోడ్డు, రూ.1.5 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాలను ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. అనంతరం రూ.38 లక్షలతో నిర్మించనున్న హెల్త్ లేబరేటరీ భవనానికి భూమిపూజ చేశారు. గ్రామస్తుల చిరకాలవాంఛను నెరవేరుస్తూ ద్వారపూడి మీదుగా మండపేట–రాజానగరం ఆర్టీసీ సర్వీసును ప్రారంభించారు. 50 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పంత రోడ్ల అభివృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జెడ్ మేడపాడు, ద్వారపూడి గ్రామాల రైతులు ఎమ్మెల్సీ తోటను ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మండల సేవాదళ్ కన్వీనర్ పోతుల రాంబాబు, పార్టీ నేతలు పాలినాటి సత్యనారాయణ, సంగిశెట్టి రమేష్, యరగతపు విజయ్, పోతుల దుర్గాప్రసాద్, నామాల శ్రీనివాసరావు, నామాల వెంకన్న, తొంటాపు సత్తిపండు, తోరం శ్రీనివాస్, గూడూరి సుబ్బరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జనరంజకంగా సీఎం జగన్ పాలన

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట

మండపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజకంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన ద్వారపూడిలో ప్రారంభించారు. సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు తదితరులతో కలిసి గ్రామంలోని డ్రైవర్ కాలనీలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలందుతున్నాయా?, సమస్యలున్నాయా? అంటూ స్థానికులను ఆరాతీశారు. ప్రజలు ఆయన దృష్టికి తెచ్చిన ఆయా సమస్యలపై ఎంపీడీఓ ఐ రాజు, ఈఓ ఎ రమణతో మాట్లాడి, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారానికి గడప గడపకూ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. సీఎం జగన్ పాలన పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, మండల సేవాదళ్ కన్వనర్ పోతుల రాంబాబు, ఎంపీటీసీ పాంద్రంకి జటాధరుడు, వార్డు సభ్యులు యరగతపు విజయ్, సంగిశెట్టి రమేష్, గేదెల శ్రీనివాస్, వెలిశెట్టి బుచ్చిబాబు, పంతంగి భాస్కరమణి, పార్టీ నాయకులు పోతుల దుర్గాప్రసాద్, పాలినాటి సత్యనారాయణ, దండుబోయిన సూర్యనారాయణమూర్తి, తొంటాపు సత్తిపండు, గూడూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

సొంతింటి కల నిజం చేసిన జగన్

రాష్ట్ర మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: ప్రతి పేదవాని సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని ఉండూరులో 383 మంది లబ్ధిదారులకు ఆయన ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పేదవానికి ఇంటి స్థలం ఉచితంగా ఇవ్వడంతో పాటు, ఇల్లు నిర్మించుకునేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలా సహకారం అందించారని వివరించారు. రూరల్ మండల పరిధిలో 251 మందికి, అర్బన్ పరిధిలో 132 మందికి స్థలం మంజూరు చేసినట్టు చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కానివిధంగా అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇతర సీఎంలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, ఎంపీటీసీ ఇంత కనకదుర్గ, ఉప సర్పంచ్ పోతురాజు రజనీకుమార్, తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఉండూరు పీఏసీఎస్ చైర్మన్ దంగేటి చినబాబు ఆధ్వర్యంలో నాయకులు దంగేటి కనకారావు, మేడిశెట్టి వీరభద్రం, గుడాల దొరబాబు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించి, మంత్రి వేణుకు జ్ఞాపికను అందజేశారు.



మహిళలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రి వేణు

భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిమజ్జనం

కె.గంగవరం: నవరాత్రులు పూజలందుకున్న అమ్మవారిని భక్తిశ్రద్ధలతో బుధవారం భక్తులు నిమజ్జనం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా సందర్భంగా అమ్మవారిని ప్రతిష్ఠించి, పూజలు చేశారు. బుధవారం కోటిపల్లిలోని గౌతమి గోదావరిలో పంట కాలువలో అమ్మవార్లను నిమజ్జనం చేశారు.

ముగిసిన ఉత్సవాలు

కాజులూరు: మండలంలోని పలు గ్రామాలలో బుధవారం దేవీ నవరాత్రి ముగింపు ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, పగటి వేషాలతో అమ్మవారిని ఊరేగించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో బుధవారం శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఉత్సవ శిబిరాల నుంచి వాహనాలపై తరలించి, పుణ్య గౌతమి నదీతీరంలోని కపిలేశ్వరపురం, తాతపూడి, వాకతిప్ప, కోరుమిల్లి, కేదారిలంక, పల్లపులంక గ్రామాల పుష్కర ఘాట్లలో నిమజ్జనం చేశారు.

పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు

గుడ్ మార్నింగ్‌లో మంత్రి వేణు

రామచంద్రపురం: పురపాలక పరిధిలో ప్రజల ఆహ్లాదానికి ఉద్దేశించిన పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడమే కాకుండా, నిధులు కూడా కేటాయిస్తున్నట్టు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ వెల్లడించారు. పట్టణంలోని బ్రాడీపేట, ముచ్చుమిల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం మంత్రి వేణు గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా వార్డుల్లో కుళాయిల తాగునీటిని పరిశీలించారు. వార్డుల్లోని పార్కులను పరిశీలించి, వాటి అభివృద్ధి చర్యలపై డీఈ డీ దుర్గాప్రసాద్‌కు సూచనలు చేశారు. పలు చోట్ల ప్రజల విన్నపాలను తెలుసుకుని, డ్రైన్లు, తాగునీటి సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. మంత్రి వేణు మాట్లాడుతూ అన్ని వార్డులకు రక్షిత మంచినీటిని అందించేలా పైప్‌లైన్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరుచేసి, పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. టీ స్టాళ్లు, హోటళ్ల యజమానులు పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో కచ్చా డ్రైన్లు నిర్మాణంలో ఉన్నాయని, ఇందుకు రూ.12 కోట్లతో మున్సిపల్ అధికారులు ప్రణాళికలు రూపొందించినట్టు వివరించారు. అధికారుల దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. స్వచ్ఛ రామచంద్రపురానికి ప్రజలు సహకరించాలని కోరారు. కౌన్సిలర్ కేతా శ్రీను, కోఆప్షన్ సభ్యుడు గుబ్బల గణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీదర్, పార్టీ నేతలు నున్న బోయిన ప్రసాద్, కంచుమర్తి బాబూరావు, దార్ల శ్రీను, కుడిపూడి గణేష్, కొండేపూడి సురేష్, గుబ్బల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



బ్రాడీపేటలో పార్కును పరిశీలిస్తున్న మంత్రి వేణు

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని తాపేశ్వరంలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాసంశెట్టి రాజరాజేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సురక్ష శిబిరాల ద్వారా ప్రజల వద్దకే వైద్యులు వచ్చి, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం శిబిరంలో 340 మందికి వైద్యులు సేవలందించారు. వైఎస్సార్ సీపీ నేత, వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ గ్రంధి సూరిపండు దంపతులు రూ.పది వేలతో 15 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. జెడ్పీటీసీ కుడిపూడి భవాని, వైఎస్సార్ సీపీ నాయకులు నాగిరెడ్డి రాంబాబు, పంపన పద్మారావు, వల్లూరి రామకృష్ణ, అడ్డాల రాజు పాల్గొన్నారు.



సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు

ఏ వ్యక్తీ అనారోగ్యంతో బాధపడరాదు

కాజులూరు: డబ్బుల్లేవనే కారణంతో ఏ వ్యక్తీ అనారోగ్యంతో బాధపడరాదనే ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక ఆరోగ్య పథకాలు రూపొందిస్తున్నారని జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు అన్నారు. కాజులూరు–2 సచివాలయం పరిధిలో మంగళవారం సర్పంచ్ దండంగి సరోజిని ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై సుప్రియ పర్యవేక్షణలో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి చెందిన పలువురు వైద్య నిపుణులు 428 మంది రోగులను పరీక్షించారు. జెడ్పీటీసీ వనుం మాట్లాడుతూ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 10,032 విలేజ్ హెల్త్ సెంటర్లు, 17 మెడికల్ కళాశాలలు నిర్మించి, ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీల్లో 53,800 స్పెషలిస్టు డాక్టర్లను, నర్సులను నియమించారన్నారు. గ్రామాల్లో ప్రజలు స్వల్ప అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేసి, దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారనే భావనతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. ప్రజలకు చక్కని పాలనను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతిఒక్కరూ ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేఖాడి విజయ, ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో పేదలకు విద్య, వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిపారని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్ అన్నారు. మండలంలోని నెలపర్తిపాడులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ రాయుడు సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ శీలం విజయలక్ష్మి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ తదితరులతో కలసి ప్రారంభించారు. ప్రతి ఇంటికీ ఓ వైద్యుడిని నియమించినట్లుగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం కానీ, ప్రతి ఇంటినీ జల్లెడ పట్టి మరీ వైద్య సేవలందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కానీ.. ప్రజల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి పడుతున్న తపనకు అద్దంపడుతున్నాయన్నారు. డాక్టర్ టీఎస్ఎస్ సందీప్‌నాయుడు, డాక్టర్ ఎన్.సునీత, డాక్టర్ రత్న సుధ, డాక్టర్ ఎస్ఆర్‌సీ మూర్తి, కంటి వైద్య నిపుణుడు ధర్మవరపు కోటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, సీహెచ్‌ఓ వీరవేణి, పీహెచ్ఎన్ సుబ్బలక్ష్మి, హెచ్‌వీ వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు 501 మంది గ్రామస్తులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి సూర్యప్రకాశ్, ఎంపీటీసీ రెడ్నం సతీష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శీలం రమణ, సొసైటీ సభ్యుడు ఉండవల్లి రామకృష్ణ, మాజీ చైర్మన్ వాసంశెట్టి జార్జి, మాజీ సర్పంచ్ ఆర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



కాజులూరులో ఆరోగ్య కిట్‌ను అందజేస్తున్న నాయకులు, వైద్యులు



ఆరోగ్య కిట్లను అందజేస్తున్న ఎంపీపీ, ఇతర నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నరేన్

మాచరలో జగనన్న ఆరోగ్య సురక్ష

కపిలేశ్వరపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం మాచరలో నిర్వహించారు. ఈ సందర్భంగా 536 మందికి పరీక్షలు చేశారు. వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారులు డా.పి.చంద్రమౌళి, డా.సీహెచ్ రాకేష్ కృష్ణ చౌదరి, సర్పంచ్ వాసంశెట్టి సునీత, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు సేవలందించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. శిబిరాన్ని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎమ్మెల్సీ తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ సందర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ కర్రెడ్ల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గర్భిణులకు సీమంతం చేశారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాళ్లు ప్రదర్శించారు. ఉప సర్పంచ్ అడపా వేణుబాబ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి విష్ణు, పట్నాల బాబు, సచివాలయాల మండల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్, కార్యదర్శి చిన్నిబాబు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట

కె.గంగవరం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి, ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేసిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. భట్లపాలిక సచివాయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సచివాలయాల పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి, పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో 350 మందిని పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్ శర్మ, సర్పంచ్ యలమంచిలి పద్మావతి, ఎంపీటీసీ జిల్లెల్ల బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న తోట పృథ్వీరాజ్

ఆరోగ్య సురక్షకు అపూర్వ స్పందన

రాయవరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని ఎంపీపీ నౌడు వెంకట రమణ అన్నారు. మండలంలోని మాచవరం సచివాలయం–2లో మంగళవారం సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే వైద్యసేవలందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు సేవలందించారు. గ్రామంలోని 622 మందిని పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పీహెచ్‌సీ చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్లు పడాల రాజారెడ్డి, వెలగల అమృత రామారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు కత్తుల అప్పారావు, నల్లమిల్లి వెంకటరెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి, మేడపాటి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.